1974 మే 8వ తేదీన
పూనా "వసంత వ్యాఖ్యానమాల"లో
పరమపూజనీయ సరసంఘచాలక్
శ్రీ బాలాసాహబ్ దేవరస్ ప్రసంగం

సాంఘిక సమానత్వ, హిందూ సంఘటన

వసంత వ్యాఖ్యానమాల కార్యక్రమ నిర్వాహకులు కొన్ని అంశాల నిచ్చి నన్ను ప్రసంగించమని కోరారు. వాటిలో మన దేశ భవిష్యత్తుకు మిక్కిలి ప్రధానమైనదైన 'సామాజిక సమత - హిందూ సంఘటన' అనే అంశాన్ని నేను తీసుకొన్నాను. జాతీయ శ్రేయస్సుకు హిందూ సంఘటన చాలా అవసరమైనది. అందుకే దీనికి సంబంధించిన అన్ని అంశాలు ముఖ్యమైనవి. వీటిలో 'సామాజిక సమత' అనే సమస్య చాలా సున్నితమైనదీ ప్రస్తుతం చర్చించదగు అంశమూ అయినందున నాకిది మరీ ముఖ్యమైనదిగా అన్పించింది. అందుకే ఈ అవకాశాన్ని తీసుకొని పై సమస్యపై నా అభిప్రాయాలను వ్యక్తం చేయాలనుకొన్నాను.

సమాజంలో ఒక పండితుడనని కాని, ఆలోచనాపరుడనని కాని నేను భావించుకొనడంలేదు. కాని ప్రజల మధ్య నేను ఎక్కువగా తిరిగాను.

అప్పుడు నాకు అనేక అనుభవాలు కలిగాయి. అనేక భావాలు ఏర్పడ్డాయి. అలాగే ప్రజల ఆలోచనలను గమనించే అవకాశంకూడా లభించింది. ఆ అనుభవాలను దృష్టిలో వుంచుకొని మన మందరం యీ సమస్యలనుగురించి ఎలా భావనచేస్తున్నామో మీ ముందుంచడానికి ప్రయత్నిస్తాను.

హిందువు అంటే ఎవరు ?

ఈ అంశం గురించి విశ్లేషణ ప్రారంభించే ముందు "హిందువు అంటే ఎవరు ?" అనే ప్రశ్న సహజంగా మనముందు నిలుస్తుంది. 'హిందూ' శబ్దానికి ఎన్నో నిర్వచనాలున్నాయి. కాని ఆ నిర్వచనా లన్నింటికీ 'అతివ్యాప్తి' లేదా 'అవ్యాప్తి' దోషం పట్టినందున, అవి నిర్దిష్ట మనడానికి వీలులేదు. అంతమాత్రంచేత హిందూసమాజపు ఉనికినే మనం త్రోసివేయగలమా ? ఆ శబ్దాన్ని పూర్ణంగా నిర్వచించలేకపోయినప్పటికీ 'హిందూ సమాజం' ఉన్నదనే విషయం మనందరికీ తెలుసు. అంతేకాక ఈ సమాజం ఎవరితో ఏర్పడివున్నదోకూడా మనకు నిర్దిష్టమైన ఒక సమాన అవగాహన ఉన్నది.

కొన్ని సంవత్సరాల క్రితం ప్రభుత్వం హిందూకోడ్ బిల్లును రూపొందించింది. దానిని పార్లమెంటు ఆమోదించింది. పండిట్ నెహ్రూ, డాక్టర్ అంబేద్కర్‌లు యీ బిల్లును రూపొందించడంలో ప్రధాన పాత్ర వహించారు. ఈ దేశంలోని విస్తృత సమాజానికి వర్తింపజేయడానికే వారు దీనికి 'హిందూకోడ్' అని పేరు పెట్టవలసివచ్చింది. అంతేకాక ప్రారంభ దశలో ఇది ఎవరికి వర్తిస్తుందనే అంశాన్ని గురించి వారు 'ముస్లిములు, క్రైస్తవులు, పార్శీలు, యూదులు తప్ప మిగిలిన అందరికీ ఇది వర్తిస్తుంది' అని ప్రకటించారు. అంటే సనాతనులకు, లింగాయతులకు, ఆర్యసమాజీయులకు, జైన, బౌద్ధ, సిఖ్ మతస్థులకు తదితరులకు ఈ 'కోడ్' వర్తిస్తుంది.

అంతేకాక ఈ 'కోడ్' నుండి మినహాయింపు కోరేవారు తమ వాదాన్ని హేతుబద్ధంగా నిరూపించవలసి వుంటుంది – అని కూడా వారందు పేర్కొన్నారు. ఎందుకంటే–వారి మనస్సులలో ఉన్న ప్రజల నందరినీ పేర్కొనగల సమగ్రమైన పదం 'హిందు' అనేది ఒక్కటే అయింది.

రెండు ప్రాతిపదికలు

హిందువులందరినీ సంఘటితం చేయాలని మనం అనుకొంటున్నాం. సంఘటన అంటే ఏదో ఒక గుంపుకాదు; సభా సమావేశాదులూ కాదు. వ్యక్తులను ఏకత్రితం చేయడం, వారిని కలిపి ఉంచడం, ఆ సమైక్యత ఎందుకో వారికి తెలియజెప్పడం–ఇదీ సంఘటన అంటే. ఈ పని సులభసాధ్యం కాదు. దీనికొక ఆధారం అవసరం. ఈ మూలాధారములలో కొన్ని భావనాత్మకంగా ఉండవలసి ఉంటుంది. మానవుని మనోలక్షణం అట్టిది. కనుక మనం మాతృభూమితో ప్రారంభిస్తాం.

"ఇది మన మాతృభూమి. మనమందరం యీ తల్లి బిడ్డలం. ఇక్కడ గత వేలాది సంవత్సరాలుగా ఉంటున్నాం. సుదీర్ఘమైన కాలంలో మనం ఇక్కడ ఎంతో ఉజ్జ్వలమైన చరిత్ర సృష్టించాం. ప్రపంచానికి తత్వాన్ని, సభ్యతను, సంస్కృతిని అందించాం. మనమే ఈదేశపు ఉన్నతికీ, అవనతికీ బాధ్యులంగా ఉన్నాం. అందుచేత ఈ తల్లి సంతానంగా మనమందరం కలసి మెలసి ఉండాలి, ఒకటిగా జీవించాలి"–ఈ వాస్తవాల పునశ్చరణవల్ల మనలో భావసమైక్యతకు పునాదిపడుతుంది. హేతువాదులమని చెప్పుకొంటున్నవారు సైతం భావ సంబంధమైన యీ పునాదిని అంగీకరింపవలసి వుంటుంది. ఇందులో దోషమేమీ లేదు. రెండవ ప్రపంచయుద్ధకాలంలో రష్యా తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు స్టాలిన్ 'మనమందరం ఒక గొప్ప దేశానికి చెందిఉన్నాం' అని తన ప్రజలకు గుర్తు చేయవలసి

వచ్చింది. జాతీయభావనను, పితృదేశభావనను ఆయన వారిలో ఉద్దీపించ వలసి వచ్చింది. కనుక ఇట్టి భావనాత్మక ప్రేరణ ఆవశ్యకమనేది నిర్వివాదం.

అయితే ఇంతమాత్రం చాలునా? ఈ భావనకొక వ్యావహారిక స్వరూపం కూడ అవసరమని సామాజికరంగంలో పనిచేస్తున్నప్పుడు మన స్ఫురణకు వస్తుంది. మన మందరమూ ఒకటి అనే భావన కలగడం ఎంత అవసరమో, దైనందిన జీవితంలో సహజంగా నిత్యమూ ఈ ఏకత్వం అనుభూతికి రావడమూ అంతే అవసరం. భావనతోబాటు నిత్యానుభవంలో సైతం యీ ఐక్యత ఉండకపోతే ఐక్యతకై మనం వేసే పునాది పటిష్టంగా చిరస్థాయిగా ఉండదు.

పొరపాటు మనదే

కేవలం కొద్దిమంది ముస్లిములో ఆంగ్లేయులో మనల్ని శాసించి, ఎందరినో బలవంతంగా తమ మతాలలోనికి మార్చివేసుకొన్నారని మన గత చరిత్ర స్పష్టంగా చెబుతున్నది. వారే బ్రాహ్మణులు – అబ్రాహ్మణులు, సవర్ణులు–అస్పృశ్యులు అనే భేద భావనలను సృష్టించారని మనకు తెలుసు. అయితే ఈ విషయంలో తప్పంతా విదేశీయులదని చెప్పి మనం మన బాధ్యతనుండి తప్పించుకోలేము. విదేశీ సంపర్కంవలన, వారి భేదనీతి వలన మన ఐక్యత విచ్ఛిన్నమైనదనడంవల్ల ప్రయోజన మేముంది? ఏదో ఒకనాడు విదేశీ సంస్కృతుల పరిచయం మనకు కలగక తప్పదు. వారికి మనకు మధ్య ఒక బెర్లిన్ గోడ శాశ్వతంగా వుండజాలదు. ఇతరుల సంపర్కమన్నా, ఆలోచనలన్నా భయపడేవారుమాత్రమే ఈగోడలు నిర్మించుకొంటారు. ఇతరుల సంపర్కంలో వుండికూడా నిజస్థితిని మరువక ఉన్నత శీర్షంతో చరింపగల వ్యవస్థయే గొప్పది. అలాకాక చుట్టూ ఒక రక్షాకవచం నిర్మించుకొన్న వ్యవస్థ తన న్యూనతను చాటి చెప్పుకొంటుంది. అందుచేత

లోపాలోపాల గురించి విదేశీయులను నిందించక, వారి ఆగడాలకు మనలో ఏ బలహీనతలు అవకాశం యిచ్చాయో పునరాలోచనచేసికొనడం మంచిది. ఆర్. ఎస్. ఎస్. సంస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్‌కు ఈ విషయంలో ఒక విశిష్టమైన దృష్టి వుంది. ఎప్పుడు యీ అంశంపై చర్చవచ్చినా ఆయన "మన పతనానికి క్రైస్తవులనో, ముస్లిములనో నిందించి, మన బాధ్యత లేదని తప్పుకొనలేం. మన తప్పిదాలను గురించికూడా ఒక్కసారి పర్యాలోచన చేయాలి" – అని స్పష్టంగా చెప్పేవారు.

సామాజిక అసమానతలు మన పతనాని కొక కారణమని మనం అంగీకరింపవలసివుంది. వర్ణ భేదములు, కులభేదములు, అస్పృశ్యత మన సాంఘిక అసమానతలకు ప్రత్యక్షసాక్ష్యాలు.

విచక్షణ అవసరం

అయితే ధర్మ సంస్కృతుల గురించి గర్వంగా చెప్పుకొనే హిందూ సంఘటనా కార్యకర్తలకు ఈ సమస్య చాలా సున్నితమైనదీ, కష్టమైనదీను. గర్వించదగిన విషయాలు మనకు ఎన్నో వున్నవి; నిజమే. ఈ భూమిపై పరిఢవిల్లిన తత్వము, జీవనమూల్యాలు ప్రపంచ మేధావుల పొగడ్తలందాయి. హిందూతత్వం విశ్వమానవాళి సుఖశాంతులకు ప్రగతికి కారణభూతమయిం దని వారు కొనియాడారు. ఈ జీవన మూల్యాలు అనేక రాజకీయ చారిత్రక ఆఘాతాలను తట్టుకొని కాలగతి కెదురొడ్డి నిలచాయి. ఆ శాశ్వత జీవన మూల్యాలను భద్రంగా పదిలపరుచుకొనాలని సహజంగా మనం భావిస్తుంటాం.

ఈ పరంపరకు గర్విస్తూకూడా మనం "పాతదంతా మంచిదే" అనే ధోరణిని అవలంబించడం తగదు.

"పురాణ మిత్యేవ న సాధు సర్వమ్"

–అని ఆర్యోక్తి. ఒక విషయం ప్రాచీనమైనంతమాత్రాన మంచిది,

శాశ్వతము, సత్యప్రవచనము కానవసరములేదు. ఈ ప్రాచీన జీవనసత్యాల ప్రాతిపదికపైనే సహస్రాబ్దులుగా యిక్కడ నివసిస్తున్నాము కనుక మనం కొత్త ఆలోచనలుచేయ నవసరంలేదని అనుకోరాదు.

"తాతస్య కూపోఽ యమితి బ్రువాణాః
క్షారం జలం కాపురుషాః పిబంతి"

" మా తాత తండ్రులు యీ నుయ్యి త్రవ్వించారు. నీరు మాత్రం ఉప్పన. ఐనా వారు త్రాగారు కనుక మేమూ త్రాగుతాం" – అనే మూర్ఖ వాదం ఎవరికీ మేలుచేయదు. ఈ వైఖరి నవలంబించేవాడిని సత్పురుషుడని కాక కాపురుషుడు (పిరికివాడు) అని పిలిచారు. ఈరకం ఆలోచన మంచిది కాదు.

సమాజం ఎన్నో రకాల ప్రజలతో కూడి వుంటుంది. నూతన విషయాలను మంచివిగా, ఆదర్శప్రాయమైనవిగా గ్రహించేవారు కొందరు. మరికొందరు 'కొత్త'ను నిస్సారమైనదిగా తృణీకరిస్తుంటారు. సమాజంలోని దోషాలను నిర్మూలించి దానిని తిరిగి సంఘటితపరచే కార్యాన్ని స్వీకరించిన వారు ఈ వైఖరులు రెంటినీ అవలంబించరు. వారు:

"సంతః పరీక్షాన్యతరత్ భజంతే" అనే వైఖరిని అవలంబించవలసి వుంటుంది.

వారు చక్కటి విచక్షణతో అవసరము, ప్రయోజనకరము అయిన వాటిని పదిలపరచుకొంటూ ఏదో ఒకనాడు అంతమొందవలసినవి అంత మొందితే వ్యధచెందక ముందుకు సాగిపోతుండాలి. ఈ హేతువాదదృష్టితో విషయవివేచన చేసి మన ప్రజలు ముందుకు వచ్చినప్పుడే హిందూ సంఘటన సాధ్యమై, అసమానతలు మూలపడిపోయి ధ్యేయం సిద్ధిస్తుంది.

కాలానుగుణమైన సంస్కరణలు

ఉదాహరణకు - యూదులు తమ మతగ్రంథాలను, ఆచారాలను ఒకటి, రెండు శతాబ్దులకొకసారి సమీక్షించుకొని, కాలానుగుణంగా వాటిని పునర్విమర్శ చేసుకొంటుంటారని ఇటీవల నేను ఒక పుస్తకంలో చదివాను. మతగ్రంథాలలోని వాక్యాలను మార్చడానికి వీలు కాలేదు.అయితే వాటికి కాలానుగుణమైన నూతన వ్యాఖ్యానాలు ఇచ్చారు. వాటిని ఆచరణలోకి తెచ్చారు. వాటికి ప్రజామోదాన్ని ఇచ్చారు. దీనినిబట్టి వారు శాశ్వతమూల్యాలేవో, మార్పుచేయదగినవి ఏవో విచక్షణ చేసారని అర్థమవుతుంది. ఇదే విధంగా ప్రాచీన కాలంలో మన దేశంలో సైతం మతగ్రంథాల గురించి పునరాలోచనచేసి, అవసరమైన పునర్విమర్శలుచేసి వుంటారని నా అభిప్రాయం. కాకపోతే ఇన్ని స్మృతులు ఎలా ఆవిర్భవించాయి ? అంతేకాదు. మన దేవతలలోకూడ ఎన్నో మార్పులు వచ్చాయి. ఇంద్రుడు. వరుణుడు, అగ్నివంటి దేవతల స్థానంలో విష్ణువు, శివుడు వచ్చారు. కొన్ని సందర్భాలలో శైవులకు, వైష్ణవులకు మధ్య వివాదాలు వచ్చాయి. ఆదిశంకరులు వీరిరువురి మధ్య సామరస్యం కుదిర్చి పంచాయతన పూజావిధానాన్ని ప్రవేశపెట్టారు. ఈనాడు శివరాత్రితోపాటు శయని ఏకాదశి, ప్రబోధినీ ఏకాదశి అన్ని గృహాలలోను చేసుకొంటున్నారు. ఇలా సామరస్యాన్ని ప్రతిష్ఠించడానికి, నూతన వ్యాఖ్యానాలను ప్రతిపాదించడానికి ప్రాచీనకాలంలో ప్రయత్నాలు జరిగినాయి, పాతదైన ప్రతిదానినీ పట్టుకు వ్రేలాడాలనే వైఖరి నాడు ప్రజలకు లేదని స్పష్టమవుతుంది,

మానవులలోని బలహీనత

ప్రాచీన గ్రంథాలలోను పురాణాలలోను ఎన్నో కథలు ఉల్లేఖించబడి వున్నాయి. అవన్నీ అక్షరాలా నిజమని మనం నమ్ముతామా ? చంద్రుడు రాహుగ్రస్తుడైనప్పుడు చంద్రగ్రహణం పడుతుందని, కేతువు సూర్యుని

మ్రింగినప్పుడు సూర్యగ్రహణం వస్తుందని, పురాణాలలో వుంది. మన మత గ్రంథాలపట్ల భక్తిశ్రద్ధలుగల మనం మన పిల్లల పాఠ్యపుస్తకాలలో గ్రహణాలు ఎలా వస్తాయో చెప్పేటప్పుడు యీ అంశాన్ని పొందుపరచాలా? హేతుబద్ధము, వైజ్ఞానికము అయిన అంశాలనే పాఠ్యగ్రంథాలలో పొందు పరచవలసి ఉంటుంది.

మతగ్రంథాలను అక్షరశః విశ్వసించాలనే యీ అంధధోరణి హిందూ దేశంలోనే కాక, ఇతర చోట్ల కూడా వున్నది. 1925 లో, శాస్త్రీయ దృక్పథంలో అగ్రగామిగా విశ్వసించబడుతూన్న అమెరికాలో ఆసక్తికరమైన ఒక కేసు జరిగింది. (The Trial that shocked the world- Reader's Digest 1962 లో ప్రచురితమైనది.) ఒక ప్రాంతంలో ఒక ఉపాధ్యాయునిపై అభియోగం నడిచింది. బైబిలులోని 'ఆవిర్భావం, మానవ సృష్టి (Genesis and Creation of Man) కథకు విరుద్ధంగా అతడు పరిణామ సిద్ధాంతాన్ని బోధించాడని ఒక క్రైస్తవ పౌరుడు అతనిపై అభియోగం తెచ్చాడు. ఆ ఉపాధ్యాయుడు ఆధునిక పరిణామవాద సిద్ధాంతం ప్రకారం ఆ విషయాన్ని బోధించాడు. అతడు నేరంచేశాడని న్యాయస్థానం ప్రకటించింది. అతనికి శిక్ష పడింది. అయితే ఈనాడు క్రైస్తవు లెవరూ బైబిలులోని ఆ పరిణామం కథను నమ్మరు. అయినా బైబిలులో తమకున్న విశ్వాసాన్ని వమ్ముచేయ యత్నించరు. ఇది వింతగా కనిపించవచ్చు. కాని ఇది మనకొక గొప్ప గుణపాఠాన్ని నేర్పుతోంది.

తత్వం సనాతనం, రూపం నిత్యనూతనం

ఇట్టి సమస్యలు అన్ని దేశాలకూ ఉన్నాయి. వాటికి పరిష్కారాలు కనుగొనాలి. ఇలాఅని నేనెప్పుడు చెప్పినా "భగవంతుడే వాటిని సృష్టించాడు" అని కొందరంటున్నారు. భగవన్నిర్మితములైనవి కనుక వీటిని మార్చ

రాదని కనీసం సవరించరాదని నొక్కి చెప్పడం వీరి ఉద్దేశం కావచ్చు. కాని ఈ వాదం ఎంతవరకు నిలుస్తుంది? ఆ భగవానుడే గీతలో "ధర్మగ్లాని జరిగినప్పుడు తిరిగి అవతరిస్తాను" అని ప్రకటించాడు. అదీకాక పతన మయిన ధర్మాన్ని ఉద్ధరించడమంటే ఎట్టి పరివర్తనలు చేయకుండా పాత వ్యవస్థను పునః ప్రతిష్ఠించడమని అర్థంకాదు. మనదేశంలో ఎవరూ మహ్మద్ పైగంబరువలె "నేనే ఆఖరి ప్రవక్తను"-. అని ప్రకటించలేదు. అందుచేత ఇది దైవవాక్యము. దీనిని పరివర్తింపజేయరాదనడం ఎంతవరకు సమం జసమో పునరాలోచనచేయాలి.. శాశ్వత జీవన తత్వాలను పదిలంగా కొన సాగిస్తూనే వాటి వ్యక్తీకరణలను, వ్యావహారిక రూపములను కాలాను గుణంగా పరివర్తింపజేయడమే 'ధర్మపునరుద్ధరణ' అనబడుతుంది. ఈ మార్పులను ఆహ్వానించడానికి మనం సంసిద్ధులం కావాలి.

ప్రాచీన కాలంలో ఉండిన వ్యవస్థల ఆవిర్భావ హేతువులగురించి మనం ఎట్టి పక్షపాత వైఖరిలేకుండా, నిర్మలంగా ఆలోచించ గలగాలి. మన ప్రాచీనులు లోచూపులేకుండా, నిరంకుశమైన పద్ధతిలో, అజ్ఞానంతో యీవ్యవస్థలను నిర్మించారనుకోవడానికి కారణంలేదు. ఆనాటి సమాజంలోని మనీషులు, నేతలు ఆ కాలపు అవసరాలను, పరిస్థితులను దృష్టిలోవుంచుకొని సమాజంలో సంఘీభావం, ప్రగతి పడుగు పేకలుగా అల్లుకొని పోవడానికి అనువుగా వ్యవస్థలను, ప్రమాణములను నిర్మించారు. ఈ వ్యవస్థలు ఈనాడు అనవసరము, ప్రయోజనరహితము అయితే వాటిని పరిహరించే స్వేచ్ఛ మనకు ఉన్నది. అయితే ఒక కాలంలో ఒక వ్యవస్థను ఎందుకు ప్రవేశ పెట్టారనే అంశాన్ని మనం అవగాహన చేసుకొనడం అవసరం.

ఉదాహరణకు వర్ణవ్యవస్థను తీసుకొందాం. అతి ప్రాచీన కాలంలో వర్ణవ్యవస్థ లేదని చెబుతారు. కాలాంతరంలో సమాజ క్రమవికాసానికి ఒక

వ్యవస్థ అవసరమని భావించారు. ఆనాటి సమాజ నేతలు నాలుగు రకాల విధులు సక్రమంగా, సమర్థతతో నిర్వహించబడినప్పుడే సమాజం పురోగమించగలదని భావించారు. ఈ ఆలోచనతో, సమాజంలోని వ్యక్తుల, సమూహాల సహజ నైపుణినీ, ప్రవృత్తినీ దృష్టిలోవుంచుకొని ఆనాడు చాతుర్వర్ణ్యవ్యవస్థకు రూపకల్పన చేశారు. ఏవ్యవస్థలోనైనా వర్గీకరణము తప్పనిసరి. అయితే ఈ వ్యవస్థలో వివిధవర్గాలకుచెందిన ప్రజల హోదాలో ఎట్టి భేదమూ ఉద్దేశించబడలేదు. వర్గీకరణమువేరు; వర్గవిభేధము వేరు.

ఆదిలో ఈ వర్గీకరణ సైతం అనువంశికంగా జరగలేదని కొందరు పండితులు అంటారు. కాని కాలక్రమంలో ఎంతో విశాలమయిన యీ సమాజంలో రాకపోకల, వార్తాప్రసార సౌకర్యాలు లేనందున వ్యక్తుల సహజ ప్రవృత్తులను అంచనావేసి వర్గీకరించడం కష్టసాధ్యమై వుంటుంది అట్టి పరిస్థితులలో వ్యక్తి జన్మించిన కుటుంబాన్ని బట్టి అతడి సహజ ప్రవృత్తిని నిర్ణయించి వర్గీకరించ నారంభించి వుంటారు. ఈ విధంగా వర్ణ.వ్యవస్థ రూపు దాల్చి వుంటుంది. అప్పుడు ఉచ్ఛ, నీచ భావాలు ఆ సమాజంలో లేవు. అంతే కాక మన సమాజాన్ని సహస్ర శీర్షాలతో, సహస్ర నేత్రాలతో, సహస్ర బాహువులతో, సహస్ర పాదాలతో విరాజిల్లుతున్న ఒక 'విరాట్ రూపం'గా భావించడం జరిగింది. ఇంతటి ఉదాత్త భావనలో – పాదాల కన్నతొడలు మిన్నయని, వాటికన్న చేతులు గొప్పవని, వాటికన్న తల విశిష్టమైనదనే వికృతము,హాస్యాస్పదమునైన ఆలోచనలకు తావులేదు. సమాజం సక్రమంగా నడవడంలో ఈ అంగాంగాలన్నిటి ప్రాధాన్యం సమానమేననే భావన ఉండేది.

ఈ వ్యవస్థలో యీ నాడు మనకు కానవస్తున్న ఉచ్ఛ, నీచ భేదాలు ఆనాటి ఆ విరాట్ రూప కల్పనలో లేవు. ఆ నాడు ఇవే వ్యత్యాసాలు వుండేవని అనుకొనడం వారికి అన్యాయం చేయడమే అవుతుంది. అందుకే ఈ వ్యవస్థ సర్వజనామోదం పొందింది. కనుకనే యీ వ్యవస్థను తరతరాలుగా

కొనసాగించడానికై కొన్ని పరిమితులు, తులనములు (Checks and balances) వికసింపజేయబడినాయి. ఉదాహరణకు: మేధాశక్తి గలవారు పేదరికాన్ని వరించాలి; పాలనాధికారం గలవారికి ధనాధికారం లేదు; రాజకీయాధికారం, ధనాధికారం ఒకే వర్గానికి ఇవ్వబడలేదు. ఈ రకమైన విధి, నిషేధాలు సమర్థవంతంగా అమలులో వున్నంతకాలం ఈ వ్యవస్థ చక్కగా అక్కరకు వచ్చింది. పై విధి-నిషేధాలు కాలక్రమంలో అలక్ష్యం చేయబడినప్పుడే ఈ వ్యవస్థలో లోపాలు ప్రవేశించాయి.

ఏవ్యవస్థలోనైనా కాలక్రమంలో కొన్ని దోషాలు ప్రవేశించడం కద్దు. అన్నిరకాల అసమానతలను, ముఖ్యంగా వర్గాలను, అంతమొందించడం కమ్యూనిజం లక్ష్యమనేది సర్వజన విదితం. కాని అన్ని కమ్యూనిస్టుదేశాలలోను ఒక కొత్తవర్గం పైకి వచ్చిందని యుగోస్లావియా కమ్యూనిస్టు నాయకుడు మైలోవాన్ జిలాస్ 'ది న్యూక్లాస్' అనే ప్రఖ్యాత గ్రంథంలో వ్రాసారు. కమ్యూనిజం పుట్టిన తర్వాత 50 సంవత్సరాలలోనే ఆయన ఈ సంగతి చెప్పవలసివచ్చింది. అసలు మానవ స్వభావమే అంత. ఏ వ్యవస్థలోనైనా నిహితస్వార్థములు ఏర్పడతాయి. వర్ణవ్యవస్థ మానవసహజమైన ఈ బలహీనతకు మినహాయింపు కాదు. ఫలితంగా వ్యవస్థ అస్తవ్యస్తమై పతనమయింది. అంతమాత్రం చేత ఆ వ్యవస్థ నిర్మాతలకు దానిని ప్రవేశపెట్టినప్పుడు అట్టి స్వార్థచింతన ఉందని ఎవ్వరూ అనలేరు.

ఆనువంశికతకు పరిమితులు

ఆనువంశికత ప్రాతిపదికగా సమాజాన్ని వర్గీకరించినప్పటికీ వ్యక్తికి ఆనువంశికంగా సంక్రమించే గుణగణాలకున్న పరిమితులను ప్రాచీనులెన్నడు నిర్లక్ష్యం చేయలేదు. ఈ అంశంపై వారి దృష్టి ఎప్పుడూ ఉన్నదనడానికి నిదర్శనంగా ప్రాచీన మతగ్రంథాలలో ఎన్నో వాక్యాలు మనకు కనిపిస్తాయి. వారిలా అన్నారు :

"శూద్రోపి శీల సంపన్నో గుణవాన్ బ్రాహ్మణో భవేత్ ।
బ్రాహ్మణోపి క్రియా హీనః శూద్రాత్ ప్రత్యవరో భవేత్ ॥"

"ఆదర్శవంతమైన తన ప్రవర్తన ద్వారా శూద్రుడు ద్విజుడు కాగలడు. ఇందుకు భిన్నంగా చరించిన బ్రాహ్మణుడు శూద్రడే అవుతాడు.

"జాత్యా బ్రాహ్మణ ఇతి చేతన" — అనేది మరో సూక్తి. అనగా "కేవలం జన్మమువల్లనే ఎవ్వరూ బ్రాహ్మణుడు కాలేడు."

ఋష్యశృంగుడు, విశ్వామిత్రుడు, అగస్త్యుడువంటి ఋషులు జన్మతః బ్రాహ్మణులు కాకపోయినప్పటికీ తమ సాధనలవలన, నడవడికలవలన ద్విజత్వాన్ని సాధించారు.

ఐతిరేయ బ్రాహ్మణకర్త అయిన మహీదాసు శూద్ర స్త్రీ యందు జన్మించినవాడని పురాణాలు చెప్పుతున్నాయి. ఇదేవిధంగా తన తండ్రిపేరు కూడా తెలియని జాబాలి ఉపనయన సంస్కారం ద్వారా ద్విజుడయాడు. జన్మతః సంక్రమించే గుణగణాల పరిమితులను వారు గుర్తించారు కనుకను వర్ణవ్యవస్థను విశాల దృష్టితో, హెచ్చుతగ్గులకు అవకాశమిస్తూ నిర్వహించారు కనుకను ఇది సాధ్యమయింది. అందుకే యీ వ్యవస్థ శతాబ్దాల తరబడి మనుగడ సాగించింది.

మారిన పరిస్థితి

అయితే నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మారిన పరిస్థితులు మన ఆలోచనా విధానంలో కాలానుగుణమైన మార్పులు రావాలని సూచిస్తున్నాయి. ఆచార్యునివద్ద శుశ్రూషచేసి విద్యాభ్యాసంచేసే రోజులు పోయాయి. ఆనాడు ముద్రణయంత్రాలులేవు. యాంత్రిక యుగం యింకా అవతరించలేదు. నేతపనివారి, స్వర్ణకారుల పిల్లలు తండ్రిదగ్గరే చూచి వృత్తిని

అభ్యసించేవారు. ఇల్లే వారికి పాఠశాల. అందుచేత ఆనువంశికత, వాతావరణము వ్యక్తికి వృత్తి విద్య గరపడానికి ఎంతో సహకరించాయి. కాని ఇప్పుడు ముద్రణ యంత్రాలు వచ్చాయి. విద్య గృహాలలోకాక పాఠశాలలలో గరపబడుతోంది. ఈ యాంత్రిక యుగంలో పరిశ్రమలు ఇళ్ళనుండి కర్మాగారాలకు తరలాయి. ఎన్నో నూతన పరిశోధనలతో విజ్ఞానం అభివృద్ధి చెందింది. ఫలితంగా మొత్తం వాతావరణం మారింది.

ఆనువంశికత అనేది ముఖ్యమే అయినప్పటికీ, మనిషిని తీర్చిదిద్దడానికి వాతావరణం ఎంతో ప్రభావంకలిగి యున్నదని యీ నాడు అందరూ అంగీకరిస్తున్నారు. కనుక జన్మనుబట్టి వచ్చే వర్ణవ్యవస్థ విషయం పట్టుపట్టడం ఆధునిక కాలావసరాలకు అనుగుణం కాదు.

వాతావరణ ప్రాధాన్యత

జన్మతః సంక్రమించే కొన్ని సహజ లక్షణాలకు కొందరు విశేష ప్రాధాన్యం ఇస్తుంటారు. కొంతవరకు వారి ఆలోచన సరిఅయినదే. కాని ఈ తారతమ్యాలను ఒక సూత్రం క్రింద నిబద్ధం చేయలేము. అంతే కాక వ్యక్తులకు వంశానుగతమైన తారతమ్యాలనే అంటకడుతూపోవడం మనిషికి అంత మంచిదికాదు. ప్రకృతి విధానాలను పరిశీలించడం, మనుషుల మధ్య తారతమ్యాలను సాధ్యమైనంతగా పరిహరించడానికి కృషిచేయడం అతని విధి. ఇందుకుగాను మనిషియొక్క ఆనువంశికతకు గల పరిమిత ప్రాధాన్యాన్ని గుర్తించి, అతడు నివసిస్తున్న వాతావరణాన్ని మార్పుచేయడం, విద్యగరపడం, తగిన విధానాల నతనికి నేర్పడం వంటి చర్యల ద్వారా అతనిలోని ఆనువంశిక లోపాలను సరిచేసే కృషి జరగాలి. ఈ రకం ప్రయోగాలు ప్రస్తుత కాలంలో చాలా సుగమంగా చేయవచ్చును. జపాను ప్రజలు చాలా పొట్టివారని ప్రతీతి. రెండవ ప్రపంచయుద్ధానంతరం వారు

అమెరికా ప్రజల సంపర్కంలోనికి వచ్చారు. ఫలితంగా వారి ఆహార, విహారాలలో, సాధారణ జీవన విధానాలలో గణనీయమైన మార్పు వచ్చింది. పర్యవసానంగా జపాన్ ప్రజల సగటు ఎత్తు కొంత పెరిగింది.

ప్రథమ, ద్వితీయ ప్రపంచ సంగ్రామాలకు ముందుకాలంలో మన దేశంతోబాటు పెక్కు ప్రపంచ దేశాలలో కొన్ని వర్గాల ప్రజలను సమర (Martial Race) జాతులుగా కీర్తించేవారు. కాని ఈ రెండు యుద్ధాలు జరిగినప్పుడు అన్ని దేశాలలోను ప్రజలను సైన్యంలోకి పెద్దఎత్తున చేర్చుకొని సైనికశక్తి పెంచవలసివచ్చింది. ఆ యుద్ధాలలో మామూలు సైనికులకన్న ఈ ప్రజలే ఎంతో బాగాయుద్ధం చేశారని స్పష్టమయింది. దీనితో 'మార్షల్ రేసెస్' అనే కల్పనలో విశ్వాసం పోయింది. ఈ దృష్టాంతాల దృష్ట్యా అనువంశికతను ఒక సిద్ధాంతంగా కొనసాగించాలనుకొనడం వృధా శ్రమయే అవుతుంది.

సమాజ సక్రమ నిర్వహణకు పునాదిగా నిలచిన వర్ణవ్యవస్థ ఇంకా ఉన్నదనడం హాస్యాస్పదం. పరిస్థితులు అంతగా మారిపోయాయి. ఈనాడు సర్వత్రా అవ్యవస్థ, వికృతులే తాండవిస్తున్నాయి. నేడు కులాలయితే ఉన్నాయి. కాని సమాజవ్యవస్థను పట్టివుంచడానికీ, వాటికీ ఎట్టిసంబంధమూ లేదు. వివాహ సంబంధాలవరకు మాత్రమే అది అక్కరకు వస్తున్నది. ఈనాడు వున్నది వ్యవస్థకాదు, అవ్యవస్థ. అందుచేత మన మందరం ఆలోచించవలసినది ఒక్కటే – సమాప్తం కావలసిఉన్న – తనంత తానుగా సమాప్తమైపోతున్న – ఈ వ్యవస్థ ముగింపు సక్రమమార్గంలో జరిగేటట్లు చూడడం ఎలా అనేది.

నెమ్మదిగా ముందడుగువేయాలి

ఒక నానుడి ప్రచారంలో వున్నది – "రోటీ – బేటీ వ్యవహార్" – అని. గతంలో "రోటీ వ్యవహార్" – అనగా పంక్తి భోజనం ఒక కులంవారికే

పరిమితమై వుండేది. ఆ పరిమితి యీనాడు తొలగిపోయి అన్ని వర్ణాలవారు కలిసి పంక్తి భోజనాలు చేస్తున్నారు. ఆంగ్లవిద్య, ఝుంకా-భాకార్ సంఘ్, సహపంక్తి భోజనాలు, దీనికై ప్రత్యేకంగా కృషిచేసిన సామాజిక కార్య కర్తలు - వీరందరివల్ల ఈ మార్పు వచ్చింది. సహపంక్తి భోజనాలను అలవాటుచేసిన ఘనత ఆర్. ఎస్. ఎస్. కు కూడా దక్కుతుంది. సంఘ శిబిరాలలోనూ, శిక్షావర్గలలోను సహపంక్తి భోజనాలు వర్ణబేధాలను కొంత వరకు సడలించాయి. వర్ణాంతర వివాహాలుకూడ ఈనాడు ప్రారంభమైనాయి.

సహపంక్తి భోజనాలవలెనే వర్ణాంతర వివాహాలు సైతం ఎక్కువగా జరిగినట్లైతే వర్ణభేదాలను తుడిచివేసి, సమాజంలో సమరసభావనను స్థాపించ వచ్చును - అనడానికి వెనుకాడనక్కరలేదు. కాని వర్ణాంతర వివాహాలు వర్ణాంతర భోజనాలంత సులభంకావు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని సంయమనం కోల్పోకుండా ఉచితరీతిని ప్రవర్తిస్తుండాలి. వివాహం అన గానే 'సాంప్రదాయం, మంచి సంబంధం' అనే అంశాలు ప్రాధాన్యం వహి స్తాయి. ఎవరినో ఒకరిని విచక్షణారహితంగా ఎవరూ నివాహం చేసుకోరు. వధూవరులు ఆర్థిక, సామాజిక విద్యాస్థాయిలలో సమఉజ్జీ అయినప్పుడే ఆ సంబంధాన్ని మంచి సంబంధం అంటారు. వివిధ వర్గాల నివాసస్థలాలు ప్రక్క-ప్రక్కన ఉండడం ద్వారా యిది సాధ్యమవుతుంది. ఎల్. ఐ. సి. కాలనీ, బ్యాంకు ఉద్యోగుల కాలనీ, రైల్వే వర్కర్సు కాలనీవంటి వసతి వాడల నిర్మాణం యీ విషయంలో కొంత దోహదం చేసింది. ఈ నివాస సామీప్యతతోబాటు వారి వారి ఆర్థిక స్థితిగతులు మెరుగయితే వర్ణభేదంతో ప్రమేయంలేకుండా, విద్య అందరికీ చేరువయితే వర్ణాంతర వివాహాలు మామూలు అవుతాయి. అయితే శాసనాలుకాని, ఆర్థిక ప్రలోభాలు కాని, ప్రచారాలుకాని దీన్ని సాధించలేవు. అసలు ఆ విధానాలే తప్పు. ఎంతో సున్నితమైన ఈ సమస్యకు తక్షణపరిష్కారం సాధ్యంకాదు. ఈ అంశాలను మనస్సులో వుంచుకొని, సామాజిక పరివర్తనకై ప్రతి ఒక్కరు సాయ

శక్తులా కృషిచేయాలి. మార్పురావడానికి కొంతకాలంపట్టవచ్చు: కాని వచ్చి తీరుతుంది.

అస్పృశ్యతను పెరికి వేయాలి:

అస్పృశ్యత మన సమాజంలోని అసమానతలలో అత్యంత దుఃఖ భాజనమూ, దురదృష్టకరమూ అయినది. ప్రాచీనకాలంలో ఇది లేదని కొందరు మేధావులంటారు. కాని కాలక్రమంలో యిది మన సాంఘిక వ్యవస్థలో చోటు చేసుకొని, వేళ్ళూనింది. వాస్తవం ఏమైనప్పటికీ అస్పృశ్యత అనే యీ తప్పిదాన్ని సమూలంగా నిర్మూలించవలసినదేనని మనం అంగీకరించాలి. ఈ విషయంలో ద్వైవిధీ భావనకు తావులేదు. అమెరికాలో బానిసత్వాన్ని నిర్మూలించిన అబ్రహాంలింకన్ "బానిసత్వం నేరం కాకపోతే ప్రపంచంలో ఏదీ నేరంకాదు"- అన్నాడు. అదే విధంగా "అస్పృశ్యత తప్పుకాకపోతే ప్రపంచంలో ఏదీ తప్పుకాదు-" అని మనందరం ప్రకటించవలసి వుంది.

అందుచేత అన్ని విధాలుగాను ప్రయత్నించి యీ అస్పృశ్యతను నిర్మూలించాలి. సమాజ అసమానతలు కారణంగా మనమేవిధంగా బలహీనులమై, అవ్యవస్థితులమైనామో ప్రజలందరికీ విశదం చేయాలి. వీటి నుండి విముక్తినందడానికి మార్గాలను వారికి చూపాలి. ఈ కృషిలో ప్రతిస్త్రీ, ప్రతి పురుషుడు ఉద్యమించాలి. నాడు హిందూ సంఘటనకు పెద్ద అవరోధం తొలగిపోగలదు.

నచ్చజెప్పడంద్వారా సాఫల్యం

సమాజ సమతాలక్ష్యసాధనకు అన్నిరకాల మనుష్యుల మద్దతును, సహకారాన్ని పొందవలసివుంటుంది. ఇందుకు మనం నిగ్రహంతో, హుందాగా వ్యవహరించవలసివుంది. అప్పుడే విజయం తథ్యం. మన సమాజంలో ఎందరో ధర్మగురువులు సాధుపుంగవులు, పండితులు వున్నారు. వారందరికీ

సామాన్యప్రజల మనస్సులపై ఎంతో ప్రభావం వుంది. మన లక్ష్యసాధనలో వారి సహకారం కావాలి. ప్రాచీనసంప్రదాయాలను దృఢంగా విశ్వసించిన వారు వాటిని మార్పుచేయడానికి అంగీకరించరని మనం భావిస్తుంటాం. అంతమాత్రంచేత వారి సద్భావనలను తక్కువగా అంచనా వేయడం తగదు. ప్రాచీన సంప్రదాయాలను విశ్వసించే మతాచార్యులు విదేశాలలోను వున్నారు. అంతమాత్రంచేత ఆ ప్రజలు వారిని హేళన చేయరు. మనముసైతం మన ధర్మగురువులను సగౌరవంగా సమీపించి ప్రాచీన ధర్మంలోని శాశ్వత సత్యాల గురించి, కాలానుగుణంగా పరివర్తింపజేయతగు అంశాల గురించి ప్రజలకు బోధించవలసిందిగా వారికి విజ్ఞప్తి చేయాలి. ఇందువల్ల మన లక్ష్య సాధన సుకరమవుతుంది. సమాజరక్షణ బాధ్యతగల వారు తమ ఆశ్రమాల నుండి పీఠాలనుండి బయటకువచ్చి, ప్రజలతోకలిసినప్పుడే ఆ లక్ష్యం నెర వేరుతుందని ధర్మగురువులకు నచ్చజెప్పాలి.

ఇది కఠినతరకార్యంగా మనకు అనిపించవచ్చును. అది వాస్తవం కాదు. మన ధర్మగురువులు ఇప్పటికే యీ దిశలో కార్యరంగంలో పని చేస్తుండడం శుభసూచకం. స్వర్గీయ సర్‌సంఘ్‌చాలక్ పరమ పూజనీయ శ్రీ గురూజీ విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో ధర్మాచార్యులందరినీ ఒకే వేదికపై సమీకరించి వారందరి దృష్టిని యీ లక్ష్యం వైపు ప్రసరింప జేసారు. ఫలితంగా ఎందరో సాధువులు, ధర్మాచార్యులు సమాజంలోని అన్ని వర్గాలవారి మధ్య కలిసి మెలిసి మసల నారంభించారు. ఒకప్పుడు పునరాగమనమును నిరసించిన వారు తమ వైఖరిని మార్చుకొని పరధర్మీయులయిన హిందువుల పునరాగమనాన్ని స్వాగతిస్తున్నారు.

సమాజంలోని మేధావులకుకూడా ఈ విషయంలో ఎంతో బాధ్యత వున్నది. ఏరకమైన మనస్తాపం ఏర్పడకుండా, సమాజంలో సమతను సాధించడానికి వారు ఆలోచనచేయాలి. పరిష్కార మార్గాలు సూచించేవారు వాటివల్ల క్రొత్త అవరోధాలు ఉత్పన్నం కాకుండా జాగరూకత వహించాలి.

"ఉపాయం చింతయన్ ప్రాజ్ఞః
అపాయమపి చింతయేత్ —"

పరస్పర సౌహార్ద సహకార, సామరస్య భావాలను సమాజంలో పటిష్టవంతంగా పాదుచేయడానికే మనం సమతను కోరుతున్నాం. అయితే ఈ మూలసూత్రాన్ని ఆలోచింపక సమత గురించి ప్రసంగాలు చేయడం, వ్రాయడం ప్రమాదకరమే అవుతుంది.

సరైన దృష్టి

సమాజంలో ఒక ప్రత్యేక వర్గం తరచు తీవ్రవిమర్శలకు గురిచేయబడుతోంది. సమాజంలోని ఏ భాగాన్నయినా ఇలా అవమానపరచడం, నీరు కార్చడం ఎంతమాత్రం తగదు. వారిలోని స్థైర్యాన్ని ప్రోదిచేస్తూ సామాజిక పరివర్తనకు క్రొత్తవీ, మరింత మంచివీ అయిన ఉదాహరణలను వారి ముందుంచాలి. దురదృష్టవశాత్తు మన సమాజంలోని విభేదాలను విశ్వసించే వారు, సరైన దృక్పథాన్ని గ్రహించలేనివారు ఇంకా ఉన్నారు, వారూ హిందూసమాజంలోనివారే, అట్టి వారిపై విరుచుకుపడడం, వారియెడ కటువుగా వ్యవహరించడం అనవసరం. వారికి నచ్చచెప్పడానికి మరెన్నో మార్గాలున్నాయి.

ఈ దృష్టితోనే ఆర్. ఎస్. ఎస్. స్థాపకులు స్వర్గీయ డాక్టర్‌జీ కృషిచేశారు. ఆయన నేతృత్వంలో చిన్నప్పటినుండి పనిచేసే భాగ్యం నాకు కలిగింది. తొలిరోజులలో ఆసక్తికరమైన ఎన్నో అనుభవాలు మాకు కలిగేవి. తొలి సంఘ శిబిరంలో నేనూ పాల్గొన్నాను. ఆశిబిరంలో ఎందరో అస్పృశ్య సోదరులు కూడా పాల్గొన్నారు. భోజన సమయంలో వారి సహపంక్తిని కూర్చుందుకు కొందరు వెనుకాడసాగారు. ఇంతకుముందు వారెన్నడూ వీరి ప్రక్కన కూర్చుని భోజనం చేయలేదు. తమ యీ సమస్యను

వారు డాక్టర్‌జీ ముందుంచారు. సంఘ క్రమశిక్షణ ననుసరించి వారిపై కఠినంగా వ్యవహరించి వారిని శిబిరంనుండి బహిష్కరించలేదు డాక్టర్‌జీ. "అందరం కలిసి కూర్చోవడం మన పద్ధతి. అలానే చేద్దాం''–అని మాత్రం ఆయన బదులు చెప్పారు.

మేమందరం సహపంక్తిలో కూర్చున్నాం. సందేహించినవారు వేరే వరుసలో కూర్చున్నారు. కాని వారే మరుసటి భోజనసమయానికి డాక్టర్‌జీ. దగ్గరకు వెళ్ళి క్షమార్పణ చెప్పుకొని, అందరితో కలిసి భోజనాలు చేసారు. తొలుత డాక్టర్‌జీ వారిపై క్రమశిక్షణ చర్యలు గైకొనివుంటే వారెన్నటికీ మారేవారుకారు.

స్వర్గీయ బచ్‌రాజ్ వ్యాస్ విషయంలో యిట్టిదే ఒక సంఘటన జరిగింది. ఆయన స్వయంసేవక్‌గా ఉన్నశాఖకు నేను కార్యవాహను. శుద్ధ శ్రోత్రియ కుటుంబంలో జన్మించిన ఆయన మాయింటికికూడా భోజనానికి వచ్చేవారు కారు. సంఘ శిబిరంలో ఆయన తొలుదొల్త పాల్గొన్నప్పుడు భోజనం చేయడం ఒక సమస్య అయింది. అందరికోసం వండిన భోజన పదార్థాలను ఆయన అందరిమధ్య కూర్చుని తినలేకపోయారు. ఈ విషయాన్ని నేను డాక్టర్‌జీకి తెలియజేసాను. డాక్టర్‌జీ సంఘక్రమశిక్షణ నిబంధనలను అనుసరించి, బచ్‌రాజ్‌జీని శిబిరానికి రాకుండాచేయలేదు. ఆయనలో తనకు కావలసిన మానసిక పరివర్తన తప్పక వస్తుందని డాక్టర్‌జీ విశ్వాసం. బచ్‌రాజ్‌జీ నిస్స్వార్థం, పట్టుదల ఆయనకు బాగా తెలుసు. ఆ శిబిరంలో బచ్‌రాజ్‌జీకి వంటసామాను, పాత్రలు యిచ్చి వంటచేసుకొందుకు ఏర్పాటు చేయించారు డాక్టర్‌జీ. ఆ ఏడు అలాగే గడిచింది. మరుసటి సంవత్సరం శ్రీ బచ్‌రాజ్ డాక్టర్‌జీ దగ్గరకు వెళ్ళి "అందరితోబాటు నేనూ భోజనం చేస్తాను''– అని తెలియజేసారు. శుద్ధశ్రోత్రియ వంశస్థుడైన బచ్‌రాజ్‌జీ సంఘ సంపర్కంతో ఏలా మారిపోయిందీ చాలామందికి తెలుసు.

రాజస్తాన్ ప్రాంత ప్రచారక్‌గా ఆయన పనిచేసారు. తదుపరి అఖిల భారత జనసంఘ అధ్యక్షులయారుకూడా.

అప్రమత్తత అవసరం

హిందూ సమాజంలో ఎన్నోసార్లు పునరావృతమవుతుండే ఆంతరిక విద్వేషాలు, సంఘర్షణలు రాజకీయ, లేక వ్యక్తిగత కలహాలవల్ల ఉత్పన్నమవుతున్నవే. ఎన్నికల కలహాలు, భూమివ్యవహారాలలో తగాదాలుకూడా యిందుకు దారి తీస్తుంటాయి. అయితే తమ రాజకీయ ప్రయోజనాలకోసం వీటిని వర్గకలహాలుగా కొందరు చిత్రిస్తున్నారు. ఇలాంటి సందర్భాలలో పెద్దలు, పత్రికా విలేఖరులు సైతం తమ అజ్ఞానంవలన రాజకీయ నాయకుల చేతి కీలుబొమ్మలుగా అయిపోతున్నారు. ముఖ్యంగా పాత్రికేయులు సంఘటనలగురించిన వాస్తవాలను క్షుణ్ణంగా తెలుసుకోనక, తమకు అందిన కొద్ది పాటి సమాచారాన్ని ఆసరాగా తీసుకొని 'కథ' అల్లి ఉద్రేకం కలిగించే విధంగా 'శీర్షిక' ఇచ్చి ప్రచురిస్తారు. హిందూ - ముస్లిం కొట్లాటలు జరిగినప్పుడు వాటిని వారు ఒక వర్గానికీ, మరొక వర్గానికీ మధ్య జరిగిన సంఘర్షణగా చిత్రిస్తారు. కాని అదే హిందువులలో జరిగే చిన్న చిన్న తగాదాలను వీరు పెద్దవిచేసి ఉద్రేకపరిచే రీతిలో వర్ణిస్తారు. ఇది ఎంత మాత్రము అభిలషణీయముకాదు. సాంఘిక అసమానతలను తగ్గించాలనుకుంటే మనలోని అన్ని వర్గాల ప్రజలు బహు జాగరూకతతో, సహనంతో మనం చేసే అన్ని పనులలోనూ వ్యవహరించవలసి వుంటుంది.

విమర్శకాదు - సహకారం

మన సమాజంలోని హరిజనులు, వెనుకబడిన వర్గాలవారు శతాబ్దాల అవమానాన్ని, కష్టాన్ని, అన్యాయాన్ని సహిస్తూవచ్చారన్నది సుస్పష్టమైన విషయం. వారిలో తత్సంబంధమైన బాధ ఉన్నది. తీవ్రమైన వ్యథ

ఉన్నది. దీని నిర్మూలనకు యిప్పుడు ఒక పరిష్కారం కనుగొనాలి. వారిపై అన్యాయాలు తగవని, వాటిని యిక అంతంచేయాలని అందరం అనుకొంటున్నాం. మన ప్రతి మాట, ప్రతి చేత యీ కృషికి అనువుగా వుండాలి. పీడిత, తాడిత సోదర హిందువులు సైతం సహనంతో జాగరూకతతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మన సమాజంలోని దోషాలగురించి తప్పకుండా విమర్శించవలసిదే. కాని విమర్శలలో అనేక రకాలున్నాయి. విదేశీయులు మనలను కక్షతో, నిరసనభావంతో విమర్శిస్తారు. మనం విమర్శించేటప్పుడు దానిలో అభిమానంతో, ఆతురతతోకూడిన వేదన ఉంటుంది. గతంలోని వైషమ్యాలను తిరగతోడడం భవిష్యత్తును అస్తవ్యస్తం చేసుకొనడమే. ఈ ధోరణి సామరస్యానికి, సమతా స్థాపనకు గొడ్డలిపెట్టు. పీడిత ప్రజలు సైతం ఈ సమాజానికి అంగభూతులమనే భావంతో అందరివలెనే మనలడం నేర్చుకోవాలి. సమాన అభిప్రాయాలు, సమాన భావాలుకల తోటివారితో వీరు భుజంభుజంకలిపి సహకరించినట్లైతే అందరి సమష్టి కృషి ఫలితంగా సమాజసమతా లక్ష్యం అద్యతనభావిలోనే సిద్ధించగలదు.

గతంలో నిమ్నవర్గాలకు చెందిన ప్రముఖనాయకులు కొన్ని కులాలను, మత గ్రంథాలను విమర్శించారు. ఆ కాలంలో అది అవసరమే. ప్రజాభిప్రాయాన్ని ఒక లక్ష్యంవైపు మరలించడానికి ఒక్కొక్కప్పుడు కటువుగా వ్యవహరించవలసి వస్తుంది; కఠినంగా మాట్లాడవలసివుంటుంది. కాని ఈ తీవ్రధోరణి ఎల్లకాలం కొనసాగరాదు. ఇప్పుడు కాలం మారింది. వాస్తవమైన పరివర్తన రూపుదాల్చవలసిన సమయమిది. ఈ పరివర్తనకు అనురూపమయిన భాషనే ఇప్పుడు మనం వాడవలసివుంది.

పురుషార్థం చూపాలి

మన సమాజంలోని వెనుకబడిన వర్గాలవారు ఎవరి దయాధర్మాన్ని యాచించవలసిన పనిలేదు. తమ ప్రతిభావ్యుత్పత్తుల ననుసరించి ఇతరులతో

సమానమైన ప్రతిపత్తి మాత్రమే వారికి కావాలి. ఇంతకాలంగా వెనుకబడి వున్నందున వారి అభివృద్ధికి తగు అవకాశాలు, సదుపాయాలు కలిగించాలి. వారి ఈ కోరిక సమంజసమైనది. ఈ ప్రత్యేక సదుపాయాలు, రిజర్వేషనులు ఎంతకాలం కొనసాగాలనేది వారు నిర్ణయించుకోవాలి. తదుపరి కాలాలతో ఇతరులతో సమానంగా వారు పోటీకి నిలబడవలసి వుంటుంది. తమ ప్రతిభ ఆధారంగా తగు సమానస్థాయిని పొందవలసి వుంటుంది. ఈ విషయం వారికీ తెలుసుననుకుంటాను. స్వీయ వికాసానికి, అభివృద్ధికి అనుగుణమైన ఒక నిర్దిష్టపథకాన్ని వారే రూపొందించుకోవాలి. ప్రతిభా వ్యుత్పత్తులలో "మనందరం సమానం" అనే భావన కలిగే రోజు రావాలి.

సమతకు ప్రాతిపదిక

ఎన్నోలోపాలు ఉన్నప్పటికీ హిందువులలో కొన్ని విశిష్టలక్షణాలు ఉన్నాయి. జీవితాన్ని గురించి వారికి కొన్ని కల్పనలున్నాయి; కొన్ని ధోరణులున్నాయి. హిందూ సమాజం కొన్ని శాశ్వత జీవన మూల్యాలను ప్రతిష్ఠించిందని ప్రపంచ దేశాల మేధావులు కీర్తిస్తున్నారు. ఈ జీవన మూల్యాలను విశ్వసించేవారు, తదనుగుణంగా ఆచరించేవారు ఐక్యతతో, సమతతో సంఘటితులు అయితే మన సమాజంలోని విశిష్టతలు నిలిచివుండి, ప్రపంచ శ్రేయస్సుకు దోహదం చేయడానికి వీలువుంటుంది. దురదృష్టవశాత్తు హిందూ సమాజం బలహీనమై అవ్యవస్థితమైపోయింది. మానవులంతా భగవవంతుని సంతానమని విశ్వసించిన ఈ సమాజంలో ఉచ్చ, నీచ భేదాలుండడంపట్ల డాక్టర్ అంబేద్కర్ ఎంతో వ్యధచెందారు. అందరిలోను, దైవీ సంపదను, దైవీ విభూతిని సందర్శించగల విశ్వాసం వుండడంకన్న సమతకు మరొక ప్రాతిపదిక ఏదీలేదని ఆయన దృఢంగా విశ్వసించారు.

నిర్మాణాత్మక దృక్పథం అవసరం

మన సమాజానిది సుదీర్ఘ చరిత్ర. గడిచిన పెక్కు శతాబ్దాలలో ఇక్కడ ఆలోచనలకు, ప్రవర్తనలకు ఎంతో స్వేచ్ఛ యివ్వబడింది. అందువలన మన గ్రంథాలలో ఎన్నో విషయాలు వ్రాయబడ్డాయి. వానిలో కొన్నిటిని తప్పుగా అన్వయించారుకూడా. ఒక ఉదాహరణ ఇస్తాను:

"న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి"- (స్త్రీకి స్వతంత్ర మివ్వరాదు-) అనేది మనసమాజం స్త్రీని క్షుద్రంగా భావించిందనడానికి ఉదాహరిస్తూ ఉంటారు. అయితే "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా" (స్త్రీ పూజింపబడే చోట దేవతలు వసిస్తారు.) అనే సూక్తి చూచినట్లయితే ఈసమాజంలో స్త్రీ కి ఎంతటి అత్యున్నతస్థానం ఇచ్చారనేది స్పష్టమవుతుంది. సమాజంలో ఐక్యతను. సమరస భావనను నిర్మించగోరేవారు ఒక విషయాన్ని ఆలోచించాలి. సమాజంలోని అసమానతలను తొలగించడానికీ. హిందూసమాజాన్ని సంఘటితపరచడానికీ మన మత గ్రంథాలనుండి, మన చరిత్రనుండి ఏయే అంశాలను గ్రహించాలో పరిశీలించాలి.

హిందువులందరూ ఏకంకావాలనీ, సాంఘిక సమానత ద్వారానే ఇది సాధ్యమనీ మనమందరం గుర్తించాలి. ఈ విశ్వాసంతో సమాజాన్ని సంఘటితము, శక్తిసంపన్నము చేయడానికి మనమంతా ముందుకు రావాలి. ఇదే ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వకమైన విజ్ఞాపన.



ప్రశ్నలు, జవాబులు

ప్రశ్న : హిందూసంఘటన చాలా నెమ్మదిగా జరుగుతున్నందుకు మాకు ఎంతో బాధగా ఉంది. దానిని మరింత వేగంగా జరపడానికి సూచనలు ఇవ్వగలరా ?

జవాబు : ఈ దేశ అభ్యుదయానికి హిందూ సంఘటన ఆవశ్యకమని మనమంతా భావిస్తున్నాం. కనుక ఈ విషయంలో మీ ఆందోళన సహజమే. ఇది హిందూరాష్ట్రమని కొందరు అంగీకరించవచ్చు, కొందరు అంగీకరించక పోవచ్చు. కాని ఇక్కడి జనసంఖ్యలో హిందువులు 85 శాతం ఉన్నారు. కనుక వారీ దేశానికి మూలాధారమని అంతా అంగీకరించవలసి ఉంటుంది. కులాలు, పంథ్‌లు, భాష, ప్రాంతము కారణంగా వారిలో విభేదాలున్నంత వరకు ఈ దేశానికి భవిష్యత్తు లేదు. ఇతరులుకూడ ఈ జాతీయ జీవన ప్రవాహంలో చేరడానికి హిందూ సంఘటన జరిగితీరాలి. హిందువులు సమైక్యంగా ఉన్నప్పుడే వారి మనస్సులలో అవాంఛనీయమైన అత్యాశలు ప్రవేశించవు. పరిస్థితులు ఎంత కష్టంగా ఉన్నా, ఎంత వ్యతిరేకంగా ఉన్నా, రాజకీయ కారణాలవల్ల ఇతర కారణాలవల్ల మనకు ఎన్నో సమస్యలు సృష్టించబడినా – దానినుండి ఒక పరిష్కారాన్ని మనం కనుగొనాలి. దీనికై మనం మన సోదరులలో ప్రతిఒక్కరినీ కలుసుకోవాలి; ఉచితానుచితాలను గురించి వారికి తెలియజెప్పాలి. కాలదోషం పట్టి, వికృతి పొందిన వ్యవస్థల వల్ల జనిస్తూన్న సామాజిక దోషాలను వారికి ఎరుకపరచాలి. ఈ కృషిలో రా. స్వ. సంఘం బ్రహ్మాండమైన విజయాలను సాధించిందని నేను చెప్పడం లేదు. అయితే దాదాపు అన్ని ప్రాంతాలలో అన్ని కులాలకు, పంథ్‌లకు చెందిన ప్రజలు మాతో ఉన్నారు. ఏ ఇతర కార్యపద్ధతీ మనం కోరే

ఫలితాలను ఇవ్వజాలదని మా అనుభవం చెపుతోంది. ఒక్కొకసారి మేము సంఘకార్యంలో కొంత ప్రగతి పొందిన తర్వాత కొందరు వ్యక్తుల ప్రవర్తనవల్ల దానికి అంతరాయం కలుగడం కద్దు. ఫలితంగా సంఘకార్యం కొంత మందగించినట్లు అనిపిస్తుంది. విశాలమైన మన దేశంలో ఎన్నో పార్టీలు, ఎన్నో సిద్ధాంతాలు, ఎన్నో స్వార్థపరశక్తులు ఉన్నాయి. కనుక అట్టి పరిస్థితి ఏర్పడడం సహజమే. కొందరు వ్యక్తులు ఆ విధంగా ప్రవర్తించడానికి కారణం వారికి మనం విషయాన్ని సరిగా తెలియజెప్పక పోవడం కావచ్చు. ఈ విషయాలను గుర్తించి ఆలోచనాపరులంతా ముందుకు వచ్చి, మా కృషిలో పాల్గొంటే ఈ సమస్యలను త్వరగా పరిష్కరించ వచ్చు.

* * * * * * *

ప్ర : శ్రీ గురూజీ చాతుర్వర్ణ్య వ్యవస్థను సమర్థించారని మాలో కొందరు భావిస్తున్నారు. అది ఎంతవరకు నిజం?

జ : బహుశా ఆ వ్యక్తులకు శ్రీ గురూజీ దేన్ని అంగీకరించారో, దేన్ని అంగీకరించలేదో స్పష్టంగా అర్థమై ఉండదు. ఈ విషయంపై వాదోపవాదాలు ఏర్పడిన తర్వాత నేను శ్రీ గురూజీతో మాట్లాడాను. అప్పుడు వారు నాతో చెప్పిన విషయం నాకు బాగా గుర్తుంది. గతంలో చాతుర్వర్ణ్య వ్యవస్థ ఎందుకు నిర్మించబడిందనే విషయాన్ని గురించి మాత్రమే వారు మాట్లాడారు. కాని వారి మాటలకు విపరీత వ్యాఖ్యలు చేయ బడ్డాయి. వారి మాటలు యథాతథంగా ఉల్లేఖించబడలేదు. దానివల్ల ప్రస్తుతం ఉన్న వర్ణవ్యవస్థ శాస్త్రీయమైన వ్యవస్థఅనీ, అది సమాజ ధారణకు అవసరమనీ వారన్నట్లు అర్థం కల్పించబడింది.

ఆతర్వాత ఈవిషయంపై తమను కలుసుకున్నవారితో మాట్లాడుతూ శ్రీ గురూజీ స్పష్టంగా ఇలా అన్నారు : "ప్రాచీనకాలంలోని ఆ వ్యవస్థ యొక్క శాస్త్రీయ ప్రాతిపదికనుగురించి మాత్రమే నేను మాట్లాడాను. నేడా వ్యవస్థ శిథిలమయింది, ముక్కచెక్కలయింది; దానికి కాలదోషంపట్టింది." ఇవి శ్రీ గురూజీ స్వయంగా చెప్పిన మాటలు. ఎవరూ వీటిని పట్టించుకో లేదు. స్వార్థశక్తులు తమ పాత ఆరోపణలను సాగించాయి.

* * * * *

ప్ర : రాజకీయాలవల్ల కులతత్వం మళ్ళీ పెరుగుతూన్నట్లు కనబడుతోంది. ఈ ధోరణిని ఎదుర్కొనడం ఎలా ?

జ : నేటి రాజకీయాల ధోరణులను, గ్రామాలలోని వాతావర ణాన్ని చూచినప్పుడు కులతత్వం పెరుగుతోందనే అభిప్రాయంకలుగుతుంది. కాని నేనలా భావించడంలేదు. కులతత్వం సమాజంనుండి అంతరించాలని సిద్ధాంతరీత్యా అంతా ప్రకటించిఉన్నారు. కాని ఎన్నికలలో ఓట్లకోసం కొన్ని నిహితస్వార్థాలు ఏర్పడినట్లు కనబడుతోంది. ఈ స్థితిలో అట్టి వృద్ధనాయకు లను యువతరంలో కలపడం మన కర్తవ్యం. నేటి యువకులు వార్తాపత్రికలు చదువుతున్నారు; అందరితోను కలసి వ్యవహరిస్తున్నారు; అనుభవం సంపాదిస్తున్నారు. ఎల్లకాలం వారిని తప్పుత్రోవ పట్టించడం సాధ్యంకాదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని, మనమంతా మన కృషిని యువతరానికి సరైన దృక్పథాన్ని ఇవ్వడంపై కేంద్రీకరించాలి. పరిస్థితి ప్రస్తుతం ప్రతికూలంగా ఉన్నా, మనమలా చేస్తే మనం ఆశించే మార్పు వస్తుందని నా నమ్మకం.